నేడు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ శనివారం తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎన్‌వి రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధిరేటు లక్ష్యాలు అధిగమించాలి


సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రుణాల మంజూరుపై ప్రత్యేక శ్రద్ధచూపి కేటాయించిన లక్ష్యాలను మించి వృద్ధిరేటు సాధించాలని కలెక్టర్ జి.రాజకుమారి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరుపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి శనివారం బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమన్నారు. పీఎంఎఫ్ఎంఈ, ముద్ర రుణాలు, చేనేత కార్మికులు, స్వయం సహాయ సంఘాలు, సీఎంఈజీపీ, పశుపోషణ తదితర రుణాలకు సంబంధించి లక్ష్యాలను సాధించలేకపోవడానికి కారణాలను విశ్లేషించాలని ఎల్డీఎం, బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకుల వారీగా లక్ష్యాల సాధనపై కలెక్టర్ ఆరాతీసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే జనవరి 15 నుంచి 90 రోజుల పాటు గ్రామస్థాయిలో సభలు నిర్వహించి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. యూనియన్ బ్యాంకు ఆర్ఎం నరసింహారావు, ఏపీజీబీ ఆర్ఎం వెంకటరమణ, ఆర్థిక అక్షరాస్యత ప్రతినిధి ఆంజనేయులు, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు నంద్యాల

ఆదివారం అక్టోబరు 20, 2024

ఆమెలో కలవరం

■ మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు
■ వైద్య ఆరోగ్య శాఖ సర్వేలో గుర్తింపు

ఆదివారం ప్రత్యేకం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద ఏటా సుమారు 12 వేల మంది మహిళలు చికిత్స పొందుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కర్నూలు సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ యూనిట్ విభాగానికి ప్రతి నెలా రొమ్ము క్యాన్సర్ బాధితులు 10, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడి చికిత్సకు వచ్చేవారు 6 నుంచి 10 మంది ఉంటున్నారు. ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ప్రతి నెలా సుమారు 10 కేసులు వస్తున్నాయి. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, ఊబకాయం తదితర సమస్యల కారణంగా మహిళలు వీటి బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తించలేక

● చాలా మంది ప్రాథమిక దశలో గుర్తించలేకపోతున్నారు. ప్రాథమిక పరీక్షలపై అవగాహన లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. మరికొందరు సమస్యను గుర్తించినా దాచిపెడుతున్నారు. జబ్బు తీవ్రమైనప్పుడు కుటుంబ సభ్యులకు చెప్పి ఆసుపత్రులకు వస్తున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 35 నుంచి 45 ఏళ్ల మహిళలకు ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజస్) కింద క్యాన్సర్ పరీక్షలు చేసేలా ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. కర్నూలు జిల్లా పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్‌సీల్లో ఈ ఏడాది రొమ్ము క్యాన్సర్ 82, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు 71 మందిని గుర్తించారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి అవగాహన లేక క్యాన్సర్‌ను గుర్తించడం లేదు. చివరి దశలో తెలుసుకుంటున్నారు. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోతుండటంతో ప్రాణాలు కోల్పోతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ఇక్కడ అందుబాటులోకి తీసుకొస్తే..

కర్నూలు సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ యూనిట్‌లో ప్రాథమిక పరీక్షలే చేస్తున్నారు. మామోగ్రామ్ పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో చివరికి బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. దీనికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది.



ప్రతి బుధవారం ప్రత్యేక ఓపీ

30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. 40 ఏళ్లు దాటినవారు మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీహెచ్‌సీ స్థాయిలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఎవరికైనా అనుమానాలుంటే సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగంలో ప్రతి బుధవారం ప్రత్యేక ఓపీ ఉంటుంది. అక్కడ పరీక్షలు చేయించుకోవచ్చు.

– డా.శ్రీలక్ష్మి, గైనిక్ విభాగాధిపతి

● నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గానికి చెందిన వెంకటమ్మ (45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమెకు రొమ్ముపై చిన్న కణితి ఏర్పడింది... ఏమీ కాదని పట్టించుకోలేదు.. తర్వాత అది పెరుగుతూ వస్తుండటంతో భయపడి ఇటీవల కర్నూలు సర్వజన వైద్యశాలలోని సర్జికల్ విభాగానికి వచ్చారు. వైద్యులు పరిశీలించి రొమ్ము క్యాన్సర్‌గా నిర్ధారించారు.

● కర్నూలు నగరానికి చెందిన రామాంజనమ్మ (31) ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో సర్వజన వైద్యశాలకు వచ్చారు. పరీక్షలు చేయగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌గా గుర్తించారు.. ప్రస్తుతం కిమోథెరపీ చేస్తున్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతివలను క్యాన్సర్ కోరలు చిదిమేస్తున్నాయి. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడే మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. చాలా మంది ప్రాథమిక దశలో గుర్తించడం లేదు.. వ్యాధి ముదిరి ప్రాణాల మీదికొస్తోందని లేదని ఇటీవల ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది.

–కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే

అంకాలజీ	2019-20	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
సర్జికల్	1992	3658	4936	5124	2775	2109
మెడికల్	2569	4125	5236	5796	6164	2814
రేడియేషన్	1802	3512	4239	4939	5594	2418

మామోగ్రామ్ పరీక్ష తప్పనిసరి

మహిళలు ఎక్కువగా 30 నుంచి 40 ఏళ్ల వయస్సులో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. గతంలో ఎవరికో ఒకరిద్దరికి వచ్చేది. ప్రస్తుతం బాధితులు పెరిగిపోయారు. 30 ఏళ్లు దాటినవారు ఏడాదికొకసారి రొమ్ము పరీక్షలు, 40 ఏళ్లు దాటినవారు మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలని, స్వీయ పరీక్షలపై అవగాహన పెంచుకుంటే తొలి దశలోనే వ్యాధిని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

హెచ్‌పీవీ టీకాతో రక్షణ

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించేందుకు ఏడాదికో సారి పాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకోవాలి. దీనిద్వారా ఏదైనా ఇన్ఫెక్షన్లు ఉంటే ముందుగానే తెలుస్తుంది. ప్రస్తుతం హెచ్‌పీవీ టీకాలు అందుబాటులోకి ఉన్నాయి. దీని విలువ రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుంది. 9-15 ఏళ్ల వయస్సు పిల్లలకు ఒక డోసు వేయించినా చాలని వైద్యులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రణ

– డా.ప్రకాశ్, డైరెక్టర్, క్యాన్సర్ ఆస్పత్రి

రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే శస్త్రచికిత్స ద్వారా నియంత్రించవచ్చు. 2, 3 స్టేజీల్లో ఉన్నప్పుడు మొదట కిమో, రేడియోథెరపీ చేస్తారు. కొద్దిగా తగ్గిన తర్వాత శస్త్రచికిత్స చేస్తారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. ప్రధానంగా ప్రాథమిక దశలో ఉంటే శస్త్రచికిత్స ద్వారా లేదా స్టేజీ 2, 3 దశల్లో ఉంటే కిమో, రేడియోథెరపీ ఇవ్వాల్సి ఉంటుంది.


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

అన్న క్యాంటీన్లపై వైకాపా రాజకీయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లపైనా వైకాపా రాజకీయం చేస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. ఆత్మకూరులో శనివారం ఆయన అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించారు. పేదలకు అల్పాహారం వడ్డించారు. వారితో కలిసి ఆహారం రుచి చూశారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. పేదలకు అన్నం పెడుతుంటే వైకాపా నాయకుల కడుపు మండుతోందని విమర్శించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మారూఫ్‌ఆసియా, కమిషనర్ రమేష్‌బాబు, తెదేపా పట్టణ, మండల అధ్యక్షులు వేణుగోపాల్, శివప్రసాదరెడ్డి, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవం



అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. లోకసుభిక్షం కోసం, సకల పాపాల ప్రాయశ్చిత్తం కోరుతూ అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అర్చిస్తున్నారు. మూడు రోజుల నుంచి వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను హోమ మండపంలో కొలువుంచి అర్చిస్తున్నారు. నాలుగో రోజు శనివారం ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ఎదురుగా హోమ గుండాల్లో వేద మంత్రాలతో హోమం నిర్వహించారు. . ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్‌లు ఉన్నారు.

ఆళ్లగడ్డ గ్రామీణం , న్యూస్‌టుడే:

బాధ్యతల స్వీకరణ



శ్రీశైల దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవోగా ఇ.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పరిపాలనా భవనంలో ఆయనకు దేవస్థానం అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనాలు పలికి దీవెనలిచ్చారు.

–శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే:

121 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 121 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఆర్జీఎం కళాశాలలో ఉదయం 280 మంది అభ్యర్థులకు 233, మధ్యాహ్నం 280కు 245, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 175కు 152, మధ్యాహ్నం 174కు 158 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం వెల్లడించారు.

బాధితుల స్థలాలు చెరపట్టారు

■ నకిలీ దస్త్రాలు సృష్టించి 70 సెంట్ల ఆక్రమణ ■ అక్రమార్కులకు రెవెన్యూ అధికారుల సహకారం

జిల్లా కేంద్రం.. 70 సెంట్ల స్థలం ఖాళీగా.. దాని విలువ రూ.2.50 కోట్లు పలుకుతోంది.. రోడ్డు నిర్వాసితులకిచ్చిన ఆ స్థలం సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ధర పలుకుతుంది. గత ప్రభుత్వ హయాంలో వైకాపా నేతల కన్ను పడింది.. దొంగ పట్టాలు పుట్టించి గుట్టుగా తమ అనుచరులకు కట్టబెట్టారు. నిజాలు దాచిపెట్టే క్రమంలో దస్త్రాలు మాయం చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

కర్నూలు- కడప జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించారు. ఈ క్రమంలో నంద్యాల సమీపంలోని వెంకటేశ్వరపురంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు గృహాలను కూల్చివేశారు. బాధితులకు నష్ట పరిహారంతో పాటు ఒక సెంటు స్థలం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆ మేరకు గ్రామ సమీపంలోనే ఉడుమాల్పురం పంచాయతీకి చెందిన స్థలంలో 2016లో సుమారు 70 మందికి పట్టాలు ఇచ్చారు. పట్టాలు ఇచ్చినా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పట్టాదారులెవరూ అక్కడ గృహాలు కట్టుకోలేదు.


నాలుగు వరుసల రహదారి బాధితులకు పట్టాలు ఇచ్చిన ప్రాంతం

దస్త్రాలు మాయం చేశారు

వెంకటేశ్వరపురం గ్రామస్థులకు ఉడుమాల్పురం పంచాయతీ సర్వే నంబరు 161లో ఉన్న 8 ఎకరాల స్థలంలో కొంతమందికి, సర్వే నంబరు 530లోని 6 ఎకరాల్లో మరికొంత మందికి కొన్ని పట్టాలు ఇచ్చారు. వీటికి సంబంధించిన దస్త్రాలు నంద్యాల తహసీల్దారు కార్యాలయంలో లేవు. పలుమార్లు లబ్ధిదారులు అధికారులు, సిబ్బందిని అడిగినా సమాధానం ఇవ్వడం లేదు. ఈ రెండు సర్వే నంబర్లలో పదుల సంఖ్యలో దొంగ పట్టాలు పుట్టుకొచ్చిన క్రమంలోనే దస్త్రాలు కనిపించకపోవడం గమనార్హం. అక్రమార్కులు, సిబ్బందితో చేతులు కలిపి దస్త్రాలు మాయం చేశారు.

2015లోనే ఇచ్చినట్లు నకిలీ పట్టాలు

నాలుగు వరుసల రహదారికి ఇళ్లు కోల్పోయిన వారికి ఇచ్చిన స్థలాలను నంద్యాలకు చెందిన కొందరు వైకాపా వార్డు నాయకులు, కార్యకర్తలు తమకు కేటాయించారంటూ దొంగ పట్టాలు పుట్టించారు. 2015లోనే తమకు పట్టాలు ఇచ్చారంటూ ముందుకొస్తున్నారు. అప్పట్లో పనిచేసిన తహసీల్దారు పేరుతోనే నకిలీ పట్టాలు సృష్టించారు. కొందరు అక్రమార్కులు ఏకంగా ఆ స్థలాల్లో బేస్‌మెంట్లు నిర్మించారు. దీంతో అసలు లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

బెదిరింపులకు దిగుతున్నారు

– దస్తగిరి, వెంకటేశ్వరపురం

నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న మా ఇంటిని తొలగించారు. ఆ ఇల్లు మా అమ్మ పేరుతో ఉండటంతో 2017లో ఉడుమాల్పురం పంచాయతీలో సెంటు స్థలం ఇచ్చారు. పట్టా కూడా ఇచ్చారు. ఇదే స్థలంపై 2015లో తమకు పట్టా ఇచ్చారని నంద్యాల దేవనగర్‌కు చెందిన ఓ వ్యక్తి చెబుతున్నారు. ఇల్లు కోల్పోయిన మాకు ఈ స్థలం ఇచ్చారంటే దౌర్జన్యం చేస్తున్నారు. ఇది తమ స్థలమనని బెదిరిస్తున్నారు.

మక్క రాసుల్లో కన్నీటి సుడులు


ధాన్యం తడవకుండా కప్పిన పట్టలపై వర్షపు నీరు

అకాల వర్షాలతో రైతులు కుదేలయ్యారు. ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి పరిధిలో రోడ్లపై కి.మీ. కొద్దీ మొక్కజొన్న కుప్పలు ఆరబెట్టుకున్నారు. పట్టలు కప్పినా రక్షించుకోలేకపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ యంత్రాలతో పరిశీలిస్తే తేమశాతం 18 నుంచి 20 వరకు ఉంటోంది. తక్కువ ధరకు అమ్మేలా దళారులు ఒత్తిళ్లు తెస్తున్నారని లబోదిబోమంటున్నారు.

–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

ఉల్లి.. కన్నీళ్లు ఉబికి


జాతీయ రహదారిపై ఆరబెట్టిన ఉల్లిగడ్డలు

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంట దిగుబడులు తడిచిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 10 బొల్లవరం గ్రామంలో ఉల్లి సాగు చేసిన ఓ రైతుల రెండు రోజుల కిందట దిగుబడులు తవ్వించారు. గడ్డలను వేరు చేసేలోపు భారీ వర్షం కురిసి పొలంలో నీరు చేరింది. దీంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోతాయని భయపడిన రైతు శనివారం దిగుబడులను ట్రాక్టరుతో తెచ్చి గ్రామం సమీపంలోని 340సీ జాతీయ రహదారిపైకి ఆరబెట్టారు. తడిచిన గడ్డలు కుళ్లిపోతే పెట్టుబడులు కూడా రావని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

■ ఆన్‌జాబ్‌ట్రైనింగ్‌తో విద్యార్థులకు కొలువులు
■ ఉజ్వలభవితకు రాచబాట వేస్తున్న ఐటీఐలు

విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదు ఇవ్వడమేగాకుండా చక్కటి ఉద్యోగాలు సాధించేందుకు ఐటీఐలు కృషి చేస్తున్నాయి. ఇవి ఉజ్వల భవితకు బంగారుబాట వేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 1,617 మంది, 30 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2,977 మంది వివిధ ట్రేడుల్లో పలు కోర్సుల్ని విద్యార్థులు అభ్యసిస్తున్నారు. నంద్యాల, బేతంచెర్ల, ఆలూరు, శ్రీశైలం ప్రభుత్వ ఐటీఐ కళాశాలల విద్యార్థులు 98 మంది గత నెల 28న, అక్టోబరు మొదటి వారంలో పలు అంశాల్లో నైపుణ్యాలు సాధించేందుకు కంపెనీలకు వెళ్లారు.

- న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

ఏయే కంపెనీలంటే...?

■ డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఫిట్టర్ విద్యార్థులు 22 మంది ఈ నెల 20న రేణిగుంటలోని డిక్సన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లనున్నారు.

నంద్యాల

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు	: 5
విద్యార్థుల సంఖ్య	: 962
ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు	: 16
విద్యార్థుల సంఖ్య	: 1,180

కర్నూలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు	: 3
విద్యార్థుల సంఖ్య	: 655
ప్రైవేట్ కళాశాలలు	: 14
విద్యార్థుల సంఖ్య	: 1,797



ఐటీఐ కళాశాలలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

ఎలక్ట్రీషియన్ విద్యార్థులు 19 మంది బెంగళూరులోని రైజింగ్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, డీజిల్ మెకానిక్‌కు చెందిన 16 మంది, మోటారు మెకానిక్ కోర్సు చేస్తున్న ఆరుగురు కర్నూలు, వైఎస్సార్ జిల్లాలోని మేరా ఆటో మొబైల్ కంపెనీలో శిక్షణకు సిద్ధంగా ఉన్నారు. వచ్చే వారంలో బెంగళూరులోని ఎల్ అండ్ టి కన్‌స్ట్రక్షన్ కంపెనీతో పాటు పలు కంపెనీల్లో తర్ఫీదుకు 71 మంది సివిల్ విద్యార్థులు వెళ్లనున్నారు.

గతేడాది ఆన్‌జాబ్ ట్రైనింగ్‌కు 330 మంది..

గతేడాది ఐటీఐ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) కింద పలు ప్రాంతాల్లోని ప్రైవేట్ కంపెనీలకు పంపించారు. డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డీజిల్ మెకానిక్, వెల్డర్, మోటార్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్టు, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, మెకానిక్ మోటార్ వెహికల్ ట్రేడులకు చెందిన 117 మంది విద్యార్థులకు గాను కర్నూలు, వైఎస్సార్ జిల్లాలోని టాటా మేరా ఆటో మొబైల్స్‌కు 23 మంది, బెంగళూరు ఇండో ఎంఐఎం కంపెనీలో 41 మంది, హైదరాబాద్ ప్రగతి నగర్‌లోని ప్రీ మోల్డ్ కంపెనీలో 13 మంది, బెంగుళూరులోని మీనాక్షినగర్‌లోని యాంపినాల్ కంపెనీలో 40 మంది చొప్పున శిక్షణానైపుణ్యాలు పొందారు. జిల్లాలోని శ్రీశైలం, అవుకు, కర్నూలు జిల్లాలోని ఆలూరు, కర్నూలులోని డీఎల్టీసీ, తాండ్రపాడు బాలికల ఐటీఐ కళాశాలలకు చెందిన 213లో 123 మంది ఉద్యోగాలు పొందారు.

శిక్షణ కాలంలో..

ఇన్‌ప్లాంట్ కింద శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు స్టైఫండ్‌ను కంపెనీలు ఇవ్వనున్నాయి. కళాశాలలకు దగ్గరగా ఉండే కంపెనీలైతే రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఇస్తున్నాయి. స్టైఫండ్‌తో పాటు వసతిని కల్పిస్తున్నారు. శిక్షణా కాలంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో తక్కువ ధరకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

విడిపరికరాల తయారీ కంపెనీలో కొలువులు సాధించాం



డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ ట్రేడులో ఇన్‌స్ట్రక్టర్ బద్దుల్ ప్రసాద్ వద్ద రెండేళ్ల శిక్షణ పూర్తి చేశాం. గతేడాది ఆన్ జాబ్ ట్రైనింగ్ కింద బెంగళూరులోని రైజింగ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శిక్షణ పొందాం. ప్రతిభను గుర్తించిన కంపెనీ ఉద్యోగాలిచ్చింది. యంత్రాల విడిపరికరాల తయారీలో పనిచేస్తున్నాం. నెలకు రూ.16,500ల వేతనంతో పాటు వసతి కల్పిస్తోంది. డ్యూటీ సమయంలో ఒక పూట భోజనం అందిస్తోంది.

-మహేశ్వర్‌రెడ్డి, ఎస్.మాలిక్, వస్నూర్‌బాషా

ఉద్యోగాలు సాధించేందుకు నైపుణ్యాలు దోహదం



డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మెషినిస్టు ట్రేడు అభ్యసించాం. ఆన్‌జాబ్ ట్రైనింగ్ కింద మూడు నెలల పాటు హైదరాబాద్‌లోని ప్రీ మౌల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తర్ఫీదు పొందాం. వెంటనే కంపెనీ ఉద్యోగాలిచ్చింది. నెలకు రూ.14 వేల వేతనంతో పాటు ఉచిత వసతి కల్పించడంతో భవిష్యత్తుపై బెంగ పోయింది.

-చాంద్‌బాషా, శివ, ఎం.గిడ్డయ్య

విద్యార్థులకు మంచి అవకాశం

- ఎస్.ప్రసాదరెడ్డి, ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనరు, నంద్యాల

ఐటీఐ కళాశాలల్లో చివరి సంవత్సరం అభ్యసించే విద్యార్థులకు ఇన్ ప్లాంట్ ట్రైనింగ్ ఇప్పిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు పలు కంపెనీల్లో తర్ఫీదు పొందుతున్నారు. వచ్చే వారం నుంచి డిసెంబరు వరకు ఇంకొంతమంది వెళ్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక కంపెనీలు ఉచిత వసతి, రాయితీ భోజనాన్ని అందిస్తూ కొలువుల్ని ఇస్తున్నాయి.

నిధులివ్వక నిర్లక్ష్యం.. రైతులకు తప్పని శోకం

■ ఎస్సార్బీసీ ప్రధాన కాలువకు పొంచి ఉన్న ముప్పు ■ కూటమిపైనే ఆశలు



బనగానపల్లి సమీపంలో ప్రధాన కాలువకు గండి (పాత చిత్రం)

బనగానపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని గొప్పలు చెప్పిన గత వైకాపా ప్రభుత్వం ప్రధాన కాలువల బాగుకు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో రైతులు కష్టాల మధ్యే పంటల్ని సాగు చేస్తున్నారు. లక్షా అరవై వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎస్సార్బీసీ ప్రధాన కాలువను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లాలో గడివేముల, పాణ్యం, బనగానపల్లి, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల రైతులు ఎస్సార్బీసీ కాలువ పరిధిలో సాగు చేస్తున్నారు. ప్రధాన కాలువపై మోతాదుకు మించి లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు తిరగడంతో కాలువ కట్టతో పాటు వంతెనలు కూడా శిథిలావస్థకు చేరాయి. అధికలోడుతో వాహనాలు వెళ్లడంతో కట్ట పాడైంది. వంతెనలు నిండా గోతులు ఏర్పడ్డాయి. ఏళ్లపాటు కనీస మరమ్మతులు చేపట్టలేదు. ఎస్సార్బీసీ ప్రధాన కాలువ 1996లో పూర్తి కాగా 2004లో కాలువకు శ్రీశైలం జలాశయం నుంచి సాగునీటిని వదిలారు. అయిదేళ్ల పాటు అధికారులు ఎస్సార్బీసీ కాలువ బాగుకు నిధులు విడుదల చేయాలని ఎన్నోసార్లు ప్రతిపాదనలు పంపించినా వాటిని పట్టించుకోలేదు.

రైతుల్లో నిండా ఆందోళన

ఎస్సార్బీసీ ప్రధాన కాలువ పాములపాడు మండలం బనకచర్ల నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 114 కిలో మీటర్ల మేర ఉంది. అవుకు రిజర్వాయర్ వరకు కాలువ వెంట ప్రతి గ్రామంలోనూ వంతెనలు నిర్మించారు. వాటిని ఏళ్ల పాటు పట్టించుకోకపోవడంతో నిండా గోతులతో అవి దర్శనమిస్తున్నాయి. కాలువ కట్టతో పాటు వంతెనలపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల్లో... వర్షాలు కురిసినప్పుడు ఆయా గుంతల్లో నీరు చేరి వాహనాదారులు ఇవి తెగిపోయేలా మారాయి. గతంలో వర్షాలు కురిసేటప్పుడు బనగానపల్లి మండలం వెంకటాపురం, అవుకు మండలం మెట్టుపల్లె సమీపంలో గండ్లు పడి నీరంతా వృథాగా పొలాల్లోకి వెళ్లి రైతులు నష్టపోయారు. బనగానపల్లె సమీపంలో పడిన గండితో పట్టణంలోని బస్టాండు, ఇతర కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలపాలయ్యారు.

ఉన్నతస్థాయి అధికారులకు నివేదిక

-సురేష్‌బాబు, ఈఈ

ప్రధాన కాలువ కట్ట దెబ్బతిన్న విషయాన్ని ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేశాం. కూటమి ప్రభుత్వ నిధులు అందజేశారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం తగ్గించే చర్యలు చేపట్టాం. గతంలో జరిగిన గండ్లను పర్యవేక్షిస్తున్నాం. కాలువపై వెళ్లే వాహనాలు రాకపోకలపై నిఘా పెట్టాం.

ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నిర్మాణం పూర్తి	: 1996
కాలువ పొడవు	: 114 కిలో మీటర్లు
కాలువకు నీరు వదిలింది	: 2004
కాలువ నీటితో సాగు సుమారు	: 1.60 లక్షల ఎకరాలు
అప్పట్లో కాలువకు ఖర్చు చేసింది సుమారు	: రూ.40 కోట్లు

సలహాలు పాటించి పంటలు రక్షించుకోండి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : అధిక వర్షాల నేపథ్యంలో శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ రైతులకు సూచించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం ఉమ్మడి జిల్లా వ్యవసాయాధికారులతో



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

శిక్షణ, సందర్శన సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ఉమ్మడి జిల్లాలో పంటలకు జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. వివిధ పంటలను కాపాడుకోవడానికి చేపట్టాల్సిన చర్యలు, సూచనలను వివరించారు. మిరప, పత్తి, పొగాకు తదితర పంటల్లో నిల్వ ఉన్న నీరు బయటికి వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. తెగుళ్ల బారినపడకుండా పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏడీఏ బాలవర్ధిరాజు, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి భక్తుడొకరు రూ.51 వేల విరాళం అందజేశారు. ఎమ్మిగనూరుకు చెందిన పాగుంట్ల నరసింహారెడ్డి జ్ఞాపకార్థం



భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటిస్వామి ఆలయం

భార్య పాగుంట్ల భాగ్యమ్మ, కుమారుడు ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.51 వేల నగదును ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులుకు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి సుమారు రూ.5.19 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ వాయిదా వేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలో పనిచేసే ఉపాధ్యాయులకు 300 కిలో మీటర్ల దూరంలోని హిందూపురంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలామంది ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. కొందరిపై చిన్నపిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాంటి వారితో పాటు ఉపాధ్యాయినులను కూడా అంతదూరం శిక్షణకు వెళ్లాలని చెప్పడం సరికాదన్నారు. దీంతో వారు శిక్షణను తిరస్కరించినట్లు తెలిపారన్నారు. ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం వల్ల బోధనకు ఆటంకాలు కలుగుతాయన్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని లేదా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో మండల, జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ రంగనాయకులు, గాలయ్య, నౌమన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.80 కోట్ల భూమికి ఎసరు

☛ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి పాత్ర
☛ నకిలీ ఆధార్ కార్డు సృష్టించి రిజిస్ట్రేషన్

నిఘా విభాగం, న్యూస్‌టుడే: 'ఆదోని నియోజకవర్గంలో భూ కబ్జా మాట ఇక నుంచి వినపడదు. ప్రజలు స్వేచ్ఛగా తమ భూ వ్యాపారాలు చేసుకోవచ్చు. వైకాపా పాలనలో కొనసాగిన భూ కబ్జాలకు తన రాకతో ముగింపు పలికింది. గతంలో జరిగిన భూకబ్జాలపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తా' ఈ మాటలు అన్నది ఆదోని ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టరు పార్థసారథి.

నేడు: ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి ప్రధాన అనుచరుడు డాక్టర్ రవికిరణ్ పట్టణంలో రూ.కోట్లు విలువ చేసే భూకబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ భూమిని ఎమ్మెల్యే అనుచరుడు డాక్టరు రవికిరణ్ నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆదోని సబ్ రిజిస్ట్రార్‌కు బాధితులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే అనుచరుడు కబ్జాకు పాల్పడడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏం జరిగిందంటే

ఆదోని పట్టణం ఎస్కేడీ కాలనీలోని సర్వే నంబరు 380ఏ, 379బీ ప్లాట్ నం. 33సీలోని 6 సెంట్ల భూమిని కర్నూలు నగరంలో ఉంటున్న కె.లింగారెడ్డి భార్య కురవ హనుమంతమ్మ పేరుతో 1984 సంవత్సరంలో కొనుగోలు చేశామని హనుమంతమ్మ కుమారులు కురవ ఎంకే రాజశేఖర్, ఎంకే హరీశ్‌బాబు తెలిపారు. ఆ భూమిలో తమకు తెలిసిన వారు పశువుల మేత కోసం గడ్డివాము పెట్టుకొని స్థలానికి రక్షణగా ఉంటున్నారన్నారు. కాగా.. ఇటీవల రవికిరణ్ అనుచరులు ఆ భూమిలో ఉన్న గడ్డివామును దౌర్జన్యంగా ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బాధితులు ఆదోనికి వచ్చి విచారించగా తమ 6 సెంట్ల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

డాక్టరు రవికిరణ్ తల్లి జయలక్ష్మి ఆధార్ కార్డును హనుమంతమ్మ అనే పేరుతో నకిలీ ఆధార్ కార్డు సృష్టించారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రవికిరణ్ బావమరది చిప్పల సురేష్ బాబు పేరుపై 6 సెంట్ల స్థలాన్ని ఈ నెల 16వ తేదీన అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని శనివారం సాయంత్రం ఆదోని సబ్ రిజిస్ట్రార్ అజీమియాకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో యువకుడు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దొంగ బంగారం కేసులో దొరపల్లిలోని యువకుడ్ని అనంతపురం పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని, అనంతపురం తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతపురంలో పెద్ద మొత్తంలో దొంగ బంగారు దొరికింది. ఈ కేసు ఛేదనలో భాగంగా అనంతపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా తుగ్గలి మండలం రాంపల్లెకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో దాదాపు 14 మంది ఉండగా, డోన్‌కు చెందిన వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పాతపేటలోని ఓ దుకాణదారుడికి 20 తులాల బంగారం విక్రయించినట్లు నిందితుడు తెలిపినట్లు సమాచారం. మరో మూడు తులాల బంగారాన్ని డోన్‌లోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ తనఖాపెట్టి నగదును తీసుకున్నట్లు తెలిసింది. గతంలో డోన్‌లోని చిగురుమానుపేటకు చెందిన ఓవ్యక్తి వద్ద దొంగిలించిన సొత్తు పెద్ద మొత్తంలో ఇక్కడ వ్యాపారులకు విక్రయించినట్లు తేలింది.

నంద్యాల కంపోస్టు యార్డు పరిశీలన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల కంపోస్టు యార్డును కడప నగరపాలక సంస్థ అధికారులు శనివారం పరిశీలించారు. యార్డులో వ్యర్థాల శుద్ధి ప్రక్రియను కడప అదనపు కమిషనర్ రాకేశ్ చంద్ర, ఎంఈ రమణమూర్తి చూశారు. ఇక్కడ అమలు చేస్తున్న పద్ధతులు, తడి, పొడి చెత్త వేరుచేసే విధానాలను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీఈ రహుల్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు అక్షయ ఎంపిక

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలం జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అక్షయ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ తెలిపారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఈనెల 18న జరిగిన జిల్లాస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని వివరించారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

22 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మహానంది, న్యూస్‌టుడే : మండలంలో ఈనెల 22 నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్‌దౌలా శనివారం తెలిపారు. 22, 23 తేదీల్లో గాజులపల్లె, 24న తిమ్మాపురం, 25న బుక్కాపురం గ్రామాల్లో శిబిరాలు ఉంటాయన్నారు. ప్రజలు కొత్త ఆధార్ కార్డు పొందడానికి, తప్పులు సరిదిద్దుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం : **సమస్య** : పాత బస్టాండు నుంచి నేతాజీనగర్, అప్పలరాయపువీధి, తిక్కస్వామిదర్గా, పెద్దపేటవీధి వరకు మురుగు కాల్వల్లో పూడిక తీసి వ్యర్థాలను పక్కనే వేశారు. దీంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. **- మాలిక్, ప్రైవేటు ఉద్యోగి**

సమాధానం : కార్మికులను పంపించి వ్యర్థాలను తొలగింపజేస్తాం. **- జీవన్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య : ఇస్మాయిల్‌వీధిలో అగ్నిమాపక కార్యాలయం ఎదురుగా రెండు వీధిదీపాలు వెలగడం లేదు. **- షబ్బీర్, స్థానికుడు**

సమాధానం : వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

పెట్టుబడి సాయం విడుదల చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు చొప్పున విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేశ్‌కుమార్, ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రైతు సంఘం వ్యవసాయ సదస్సుల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 2023 ఖరీఫ్ సంబం



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ధించిన పంటల బీమా, రబీ పెట్టుబడి రాయితీ ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, టి.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మహానందీశుడికి ఏపీఈఆర్సీ సభ్యుడి పూజలు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రాన్ని ఏపీఈఆర్సీ (ఫైనాన్స్) సభ్యుడు వెంకటరామిరెడ్డి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు.

గూడులేని పురాలు.. జాడలేని సేవలు

★ కార్యాలయ భవనాలకు నోచుకోని మున్సిపాల్టీలు ★ సిబ్బంది, ప్రజలకు తప్పని ఇబ్బందులు

నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నందికొట్కూరు, ఆత్మకూరు పురపాలక సంఘాలకు సొంత కార్యాలయ భవనాలు కలగానే మిగిలాయి. ఏళ్ల తరబడి భవన నిర్మాణాలపై పాలకవర్గాలు కాలయాపన చేస్తున్నాయి. నందికొట్కూరులో గత ఎన్నికల ముందు పాలక వర్గం హడావుడిగా నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినా.. తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం నిర్మాణం నిలిచిపోయింది. ఇక ఆత్మకూరులో ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయింది. ఇరుకైన అద్దె గదుల్లో విధి నిర్వహణకు సిబ్బంది.. సేవలందక ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

నేతల స్వార్థమే.. శాపం

నందికొట్కూరు మేజర్ పంచాయతీ 2012లో పురపాలక సంఘంగా మారింది. అప్పటి నుంచి నూతన కార్యాలయ భవనం సాకారం కాలేదు. పాలకుల స్వార్థం కారణంగా నిర్మాణం పూర్తికాని పరిస్థితి నెలకొంది. 2013లో నూతన భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో స్థానికంగా ఉన్న పాత కార్యాలయం వద్దనే నూతన భవన నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక తయారు చేశారు. తర్వాత దానిని అటకెక్కించారు.

☛ పట్టణ శివారులో కొంతమంది వైకాపా నాయకులకు సుమారు 40 ఎకరాల పొలం ఉంది. దాని సమీపంలో ఓ ఎకరం పొలాన్ని ఉచితంగా పురపాలక కార్యాలయానికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. నూతన భవన నిర్మాణానికి రూ.2.38 కోట్లు మంజూరు చేయించుకుని గత సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికలు ముగియగానే గుత్తేదారు పనులు నిలిపేశారు. పట్టణ శివారులో, డంపింగ్ యార్డు సమీపాన కార్యాలయ నిర్మాణం వద్దని, ప్రజలకు దూరం అవుతుందని ప్రస్తుత పాలకులు నిర్మాణ పనులను నిలిపివేశారు. ఇప్పటి వరకు గుత్తేదారు రూ.60 లక్షల వరకు నిధులు ఖర్చు చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



నిలిచిపోయిన నూతన కార్యాలయ భవన నిర్మాణం

☛ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత భవనం ఉన్న ప్రాంతంలోనే నూతన కార్యాలయం నిర్మిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. ప్రస్తుతం పురపాలక ఖాతాలో రూ.1.78 లక్షల నిధులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కార్యాలయం ఉన్న స్థలం సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉంది. దాని ముందు మరో ఎకరం స్థలం ఉంది. ఈ రెండెకరాల్లో కార్యాలయంతో పాటు దుకాణ సముదాయాలు నిర్మిస్తే పురపాలకకు ఆదాయం కూడా సమకూరే అవకాశం ఉంది.

సమావేశానికి చోటెక్కడ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలక సంఘం కార్యాలయానికి వైకాపా హయాంలో ఐదేళ్లలో సొంత భవనం నిర్మించలేకపోయారు. ఆత్మకూరును 2011లో నగర పంచాయతీగా ప్రకటించారు. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం స్టార్టప్ నిధులు రూ.50 లక్షలు కేటాయించింది. గత ప్రభుత్వంలో ఆత్మకూరు పురపాలక కార్యాలయ భవనం కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్రస్థాయి అధికారులకు పంపించారు. సకాలంలో నిధులు విడుదల కాలేదు. దీంతో టెండర్లు వేసేందుకు గుత్తేదారులెవరూ ముందుకు రాలేదు.

☛ పురపాలక కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు, ఛైర్పర్సన్ గదుల కొరతతో విధి నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పాత బస్టాండులోని కేవీకే స్టేడియం గదులు అద్దెకు తీసుకుని పురపాలక కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అన్న క్యాంటీన్ భవనంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేవారు. ప్రస్తుతం అందులో అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించారు. దీంతో సమావేశాల నిర్వహణకు చోటు కరవైంది. ప్రస్తుతం రూ.3 లక్షలు వెచ్చించి అద్దె గదుల బయట సిమెంటు ఇటుకలతో తాత్కాలిక నిర్మాణం చేపడుతున్నారు. ఇరుకైన అద్దె కార్యాలయంలో సిబ్బందితో పాటు వివిధ సేవల కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



సమావేశాల నిర్వహణకు తాత్కాలికంగా నిర్మిస్తున్న గది

పేర్లు మాయం.. ప్రయాణం గందరగోళం



విరిగిపోయిన ఈ సూచిక బోర్డు నంద్యాల నుంచి కర్నూలు వెళ్లే రహదారిలో జిల్లా కేంద్రం శివారులోని మునగాల రోడ్డు కూడలిలో ఉంది. ముందు వైపుల నుంచి వచ్చే వాహనదారులు ఏ ప్రాంతానికి ఏ దిశలో వెళ్లాలో తెలియజేస్తూ దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఉన్న పేర్లు ఉన్న బోర్డు విరిగిపోయింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఓ దారిలో వెళ్లాల్సిన వారు మరో మార్గంలో వెళుతున్నారు. కొంతదూరం వెళ్లాక మళ్లీ వెనక్కి వస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి కొత్త బోర్డు ఏర్పాటు చెయ్యాలని ప్రయాణికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

వెలుగోడులో రూ.2.25 కోట్లతో అభివృద్ధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, న్యూస్‌టుడే : వెలుగోడు మండలంలో రూ.2.25 కోట్ల నిధులతో సీసీరోడ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం వెలుగోడు, బోయరేవుల, గుంతకందాల, తిమ్మనపల్లె గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తెదేపా మండల, పట్టణ అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీలుల్లాఖాన్, బోయరేవుల సర్పంచి సామన్న, నాయకులు జాకీర్‌హుసేన్, రామానాయుడు, సుధాకర్‌రెడ్డి, ఎల్లాల కృష్ణుడు, తహసీల్దారు శ్రీనివాసగౌడు, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధిహామీ పనులతో గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కౌలూరు, తమ్మరాజుపల్లె గ్రామాల్లో శనివారం పల్లె పండగలో భాగంగా రహదారుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కౌలూరు గ్రామంలో తెదేపా ఎంపీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చిన్నబాలయ్య, విజయగౌరి, తెదేపా నాయకులు లాయర్‌బాబు, దుబాయిశ్రీను, ఇంజినీరు మహబూబ్ బాషా, ఏపీవో విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

కానాలపల్లె (గోస్పాడు), న్యూస్‌టుడే : మండలంలోని కానాలపల్లె, సాంబవరం గ్రామాల్లో శనివారం పల్లె పండగ నిర్వహించారు. ఎంపీడీవో అమానుల్లా, తెదేపా మండల ఇన్‌ఛార్జి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఈవోఆర్డీ నాగఅనసూయ, ఏపీవో నాగజ్యోతి, గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : సీసీ రహదారుల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మండల మాజీ అధ్యక్షుడు మంచాలకట్ట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గడిగరేవుల, కె.బొల్లవరం గ్రామాల్లో శనివారం సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా నాయకులు సుభద్రమ్మ, కంది శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటరమణ, మండల ఇంజినీరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి తెదేపాతోనే సాధ్యం

పాములపాడు, న్యూస్‌టుడే : పల్లె ప్రగతి తెదేపాతోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎర్రగూడూరు, భానుముక్కుల గ్రామాల్లో శనివారం ఆయన సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



భానుముక్కుల గ్రామంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తీర్చడానికే పల్లె పండగ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. మండలంలోని మిట్నాల, గుంతనాల గ్రామాల్లో శనివారం ఆయన సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో సుగుణశ్రీ, ఈవోఆర్డీ జ్యోతి, మండల తెదేపా కన్వీనర్ మునుగాల విశ్వనాథరెడ్డి, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, రవిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో భక్తుల సందడి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : సంగమేశ్వరంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సంగమేశ్వరుడిని దర్శించుకుని కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

చాపిరేవుల (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : మానవ అక్రమ రవాణా కట్టడికి ప్రతిఒక్కరు కృషి చేయాలని మదర్ సొసైటీ సీఈవో రామారావు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సీఐ, తదితరులు

పిలుపునిచ్చారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ది మూమెంట్ ఇండియా, మదనపల్లె జ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిశ్శబ్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైల్వే భద్రతా విభాగం సీఐ నాగభూషణం మాట్లాడుతూ.. మహిళలు అక్రమంగా రవాణా అవుతున్నట్లు తెలిస్తే హెల్ప్‌లైను నంబర్లు 1098, 181కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, రైల్వే ఏఎస్సై జనార్దన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ అనాగరిక చర్య

మహానందిఫారం (మహానంది), న్యూస్‌టుడే : ర్యాగింగ్ అనాగరిక చర్య అని అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మహానంది ఫారంలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో శనివారం ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలు, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన కేసుల గురించి వివరించారు. సమావేశంలో వసతిగృహాల సంరక్షకులు స్వరాజ్యలక్ష్మి, ప్రభాకర్, ప్రొఫెసర్లు ఎల్.విజయభాస్కర్, మల్లీశ్వరరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

మహానంది, న్యూస్‌టుడే : మహానంది గ్రామ పంచాయితీ ఈశ్వర్‌నగర్ కాలనీలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బారావు, వీఆర్వో చలమయ్య శనివారం పరిశీలించారు. ఈ స్థలంలో ఉన్న నాగదేవత విగ్రహాలను తొలగించినట్లు కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు వారిని పరిశీలన నిమిత్తం పంపారు. విచారణ చేపట్టి నిర్ణయాన్ని వెలువరిస్తామని తహసీల్దారు తెలిపారు.

విద్యార్థుల హక్కులపై పోరాడాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల హక్కుల సాధనకు పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు. విజ



గోడపత్రాలు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

యవాడలో నవంబరు 5న నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది సభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం గోడపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చంటి, బాలు, దస్తగిరి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్ల నిర్మాణం ఆపాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులకు సరైన పరిహారం ఇవ్వకుండా చేపట్టిన హైటెన్షన్ విద్యుత్తు లైన్ల నిర్మాణం ఆపాలని కౌలూరు గ్రామ రైతులు కోరారు. పాణ్యం తహసీల్దారు కార్యాలయంలో శనివారం వారు తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డికి కలిసి వినతిపత్రం అందించారు. తమ గ్రామ పరిధిలోని పొలాల్లో ఓర్వకల్లు పవర్ గ్రిడ్ హైటెన్షన్ విద్యుత్తు లైన్లు కోసం స్తంభాల ఏర్పాటుకు రైతులకు నోటీసులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం పొలాల్లో పంటలు సాగులో ఉన్నాయని స్తంభాలు ఏర్పాటు చేస్తే పంటలు దెబ్బతింటాయన్నారు. సరైన పరిహారం ఇచ్చే వరకు పనులు ఆపాలని కోరారు.

సద్గుణాలు అలవర్చుకోండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు మంచి ఆలోచనా ధోరణి కలిగుండాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.శశికళ సూచించారు. ఏకాగ్రత, ఇతరులకు సాయం చేసే గుణం, పెద్దలను గౌరవించడం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెట్కూరు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు సయ్యద్ సలీమ్‌బాషా మాట్లాడుతూ పలు విషయాలపై అవగాహన కల్పించారు.

నల్లమలలో ట్రాఫిక్ సమస్యలు

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం నల్లమల అడవిలోని బొగద దిమ్మెల మలుపు వద్ద లోయలో పడిపోయిన బోరుయంత్రాన్ని వెలికి తీసేందుకు శనివారం చర్యలు చేపట్టారు. దీంతో నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. గత జూన్ 26న బోరుయంత్రం లారీ రక్షణ గోడలను ఢీకొని లోయలో పడిపోయిన విషయం తెలిసిందే. అప్పుడు బిహార్‌కు చెందిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అప్పటి నుంచి లోయలోనే ఉన్న వాహనాన్ని వెలికితీసేందుకు శనివారం మూడు పొక్లెయిన్లతో పనులు చేపట్టారు. దీంతో కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలంలో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెన్ను దశలో ఉన్న వరి పొలాలు ఎకరాలకొద్దీ నేలవాలాయి. మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి శనివారం తమడపల్లె, బొల్లవరం, నందిపల్లె గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. పంటను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయాధికారి చంద్రశేఖర్, వీఆర్వో మాధవరావు, రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తుశాఖ ఏఈ రాములునాయక్ సూచించారు. ఈ పథకం కింద మండలంలోని వడ్డెమాను గ్రామంలో ఓ ఇంటిపై శనివారం సౌర ఫలకాలు ఏర్పాటు చేశారు. రూ.2.20 లక్షల విలువైన సామగ్రికి ఈ పథకం కింద రూ.78 వేల రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర ఫలకాలను పరిశీలిస్తున్న అధికారులు

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విపత్కర పరిస్థితుల్లో అసంఘటిత రంగ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గఫూర్

కార్యదర్శి ఎంఏ గఫూర్ డిమాండు చేశారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని నేషనల్ పీజీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన అఖిలభారత రహదారి రవాణా కార్మికుల సమాఖ్య రాష్ట్రస్థాయి కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వాలు ఆటో, రవాణా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శివాజీ, ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భైరాపురంలో చిరుత జాడ

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని భైరాపురంలో చిరుత అడుగు జాడలు కనిపించడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. కొన్ని రోజుల కిందట మండల కేంద్రం మిడుతూరు సమీపంలోని వేసవి నీటి కుంట వద్ద చిరుత అడుగు జాడలు గుర్తించిన అటవీ అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన కొందరు భైరాపురం రైతులు కొన్ని అడుగు జాడలను గుర్తించారు. అవి చిరుతపులివే అని పొలానికి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. అటవీ అధికారులు స్పందించి ఆ అడుగులు చిరుత పులివా కావా అన్నది నిర్ధారించాలని కోరుతున్నారు.

22న ఉద్యోగ మేళా

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మావతిబాయి తెలిపారు. ఉద్యోగ మేళాకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. జాబ్‌మేళాలో నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పది ఆపై చదివిన నిరుద్యోగులు అర్హులన్నారు. కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి సుబ్బన్న, సీడాప్ కోఆర్డినేటర్ జి.వి.రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నివాసం

గడివేముల, న్యూస్‌టుడే : మండంలోని ఆళ్లగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో ఓ మహిళ నివాసం ఉంటున్నారని ఏసీడీపీవో పద్మావతి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. సదరు మహిళ కొంతకాలం నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో నివాసం ఉంటున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే ఎంపీడీవో వాసుదేవగుప్తా, ఎస్సై నాగార్జునరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆ మహిళకు నోటీసులు ఇవ్వాలని ఎస్సై సూచించారు.

హవిష్.. చిత్రకళలో భేష్

❖ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

నంద్యాల గాంధీచౌక్, రైతునగరం, న్యూస్‌టుడే : మనసులోని భావాలను పేపర్‌పై అందంగా చూపించగల నేర్పు సాయిహవిష్ సొంతం. చిత్రలేఖనంపై మక్కువతో శిక్షణ తీసుకుని అద్భుత ప్రతిభ చూపుతున్నాడు. కుంచెపట్టి బొమ్మలకు ప్రాణం పోస్తున్నాడు. సమాజ చైతన్యమే లక్ష్యంగా చిత్రాలు గీస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనల్లో మెప్పించి పతకాలు అందుకుంటూ విజయ పథంలో సాగుతున్నాడు నంద్యాల విద్యార్థి.

☛ నంద్యాల పట్టణానికి చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమారుడు సాయిహవిష్. 7వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి చిత్రలేఖనంలో రాణిస్తున్నాడు. శిక్షణ తీసుకుని.. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యం పెంపొందించుకున్నాడు. పర్యావరణ, జల కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే అనర్థాలు, ఇతర సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యపరిచేలా చిత్రాలు గీస్తూ జాతీయ స్థాయిలో పతకాలు అందుకుంటున్నాడు. ఇటీవల 3022 బొట్టు బిళ్లలతో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని రూపొందించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాడు. లభించిన పతకాలు

☛ 2021లో విజయవాడలో డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం అందుకున్నాడు.



సాధించిన పతకాలతో..

☛ 2021లో మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్‌లో స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ సంస్థ వారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలో స్వర్ణం గెలుపొందాడు.

☛ 2022లో హైదరాబాద్‌లో యంగ్ ఇన్ఫో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ప్రశంసా పత్రం అందుకున్నాడు.


☛ 2022 డిసెంబరులో మహారాష్ట్రలోని నాసిక్‌లో స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి ప్రదర్శనలో బంగారు పతకం సాధించాడు.

☛ 2023లో గుంటూరులో క్రియేటివ్ ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో స్వర్ణం గెలుచుకున్నాడు.

☛ 2023లో నెల్లూరులో అమీర్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకున్నాడు.

☛ 2023లో పల్నాడు జిల్లా వినుకొండలో బెజవాడ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు.

☛ 2024లో హైదరాబాద్‌లో ఫ్రాగ్రెన్స్ ఆఫ్ ఆర్ట్స్ సంస్థ వారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో బంగారు పతకం గెలుపొందాడు.



సాయిహవిష్ గీసిన చిత్రాలు

శిరీష హంతకుడిని కఠినంగా శిక్షించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నాగటూరులో శిరీషను బండరాయితో మోది హతమార్చిన ఆమె మామను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు, మహిళా, ప్రజా సంఘాల నాయకులు శనివారం వేర్వేరుగా ధర్నాలు చేశారు.



ధర్నా చేస్తున్న మహిళా సంఘం, ప్రజా సంఘాల నాయకులు

బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. తమ కుమార్తెను చంపిన మామ కురుమన్నను తమకు అప్పగించాలని నినదించారు. సీఐ కార్యాలయంలో ఉన్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సుబ్రహ్మణ్యం వచ్చి వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

☛ శిరీషను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకుడు రఘురామ్మూర్తి, మహిళా సంఘం నాయకురాలు రజితమ్మ డిమాండ్ చేశారు. స్థానిక పటేల్ కూడలిలో శనివారం వారు ధర్నా చేపట్టారు. మహిళలు, బాలికలకు రాష్ట్రంలో భద్రత కరువైందన్నారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైకాపా కౌన్సిలర్‌పై కేసు నమోదు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : తాను పూచీపడి ఇప్పించిన అప్పు తిరిగివ్వాలని అడిగినందుకు మండలంలోని కొత్తపల్లె గ్రామ శివారులో నివసిస్తున్న రవిశంకర్‌పై పట్టణంలోని 6వ వార్డు వైకాపా కౌన్సిలర్ పురంధర్‌కుమార్ దాడి చేసినట్లు గ్రామీణ సీఐ అస్రర్‌బాషా శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. రవిశంకర్, కౌన్సిలర్ పురంధర్ కుమార్ స్నేహితులన్నారు. 2018లో పురంధర్‌కు డబ్బు అవసరం కాగా రవిశంకర్ మచిలీపట్నంలోని తన మామ సుబ్రహ్మణ్యంతో రూ.9.5 లక్షలు అప్పు ఇప్పించారన్నారు. ఇందుకు పురంధర్ చెక్కులు ఇచ్చారని వివరించారు. ఆ చెక్కులను బ్యాంకులో వేయగా డబ్బు లేక చెల్లలేదన్నారు. దీనిపై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని వెల్లడించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని పురంధర్‌కుమార్, హర్షద్, నగేశ్‌లతో కలిసి గతనెల 5న తనపై దాడిచేశారని రవిశంకర్‌పై గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై నజీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మోటార్ల తీగల చోరీ

గడివేముల, న్యూస్‌టుడే : గడివేములలో ఎస్సార్బీసీ కాల్వ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు మోటార్ల తీగలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటరంగడు, రాముడు, మాబాషా తదితరులకు చెందిన 20 మోటార్ల తీగలను దొంగలు అపహరించారు. శనివారం ఈ విషయాన్ని గుర్తించినట్లు రైతులు తెలిపారు. రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించండి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలనిశనివారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసిన కోట్ల డోన్ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు చెందిన పత్రాలు అందించారు. డోన్ నియోజకవర్గం నుంచి నంద్యాల, పత్తికొండ, కోడుమూరు వైపు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ప్రధాన గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి నీటిని తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించారని ఆయన తెలిపారు.



ప్రతిపాదనల పత్రాలు చంద్రబాబుకు అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడాలి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో బాధ్యతగా చదువుకుని, తల్లిదండ్రులకు, సమాజానికి ఉపయోగపడాలని గ్రామీణ ఎస్సై మమత సూచించారు. శనివారం డోన్ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ చంద్రకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం జరిగే నేరాలపై విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

అవుకు: సమస్య: అవుకులోని కోట వీధి రహదారి అధ్వానంగా మారింది, వానకురిస్తే రాకపోకలు సాగించలేకపోతున్నాం. **-కంబగిరి రాముడు అవుకు, కోటవీధి.**

పరిష్కారం: నిధులు మంజూరైతే నిర్మాణాన్ని చేపడతాం. **-హరి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, అవుకు.**

సమస్య: యర్రగుంట్ల బస్టాప్ వద్ద విభాగినిపై తొలగించిన పిచ్చిమొక్కలను తరలించాలి. **-జగదీష్.**

పరిష్కారం: పారిశుద్ధ్య కార్మికులతో తరలిస్తాం.

-హరిలీల, పంచాయతీ కార్యదర్శి.

దద్దణాల ఎత్తిపోతల పథకం వినియోగంలోకి ఎప్పుడో?

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి సమీపంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాలువ పక్కన నిర్మించిన జుర్రేరు (దద్దణాల) ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడంతో తెదేపాపైనే ఆశలు పెట్టుకున్నారు. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సుమారు రూ.21 కోట్లు వెచ్చించి ఈ పథకాన్ని నిర్మించారు. ఇక్కడికి 13 కిలో మీటర్ల దూరంలో ఉన్న దద్దణాల ప్రాజెక్టుకు ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఎస్సార్బీసీ కాలువకు సుమారు ఐదు నెలలకు పైగా సాగునీరు విడుదల చేస్తారు. ఈనీటిని కాలువ నుంచి ఎత్తిపోసి దద్దణాల చెరువును నింపాల్సి ఉంటుంది. తొలి ఏడాది తెదేపా అధికారంలో ఉండగా నీటిని చెరువులోకి ఎత్తి పోశారు. వైకాపా వచ్చాక పథకాన్ని నిరుపయోగం మార్చింది. సుమారు 1550 ఎకరాలకు సాగునీరు అందించే చెరువు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుంది. చెరువులో నీరుంటే రైతులకు సాగునీరుతో పాటు చట్టుపక్కల గ్రామాలైన జోలాపురం, సాదుకొట్టం, పాతపాడు, మీరాపురం, మాదాసుపల్లె, యాగంటిపల్లె, బనగానపల్లె పట్టణానికి తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. ఇలాంటి చెరువుకు చిన్నపాటి పనులు చేయలేక అధికారులు ఎండబెట్టారు. ఈ ఎత్తపోతల పథకం వద్ద సుమారు రూ.10 లక్షలు వెచ్చించి మోటర్ల నిర్వహణకు ఖర్చు పెడితే వినియోగంలోకి వస్తుంది. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసేందుకు ఐడీసీ అధికారులకు సమయంలో లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ప్రారంభించేందుకు మంత్రి బీసీ సుముఖంగా ఉన్నప్పటికీ అధికారులు దృష్టి సారించలేక పోతున్నారు. ఎస్సార్బీసీ కాలువకు నీరు వచ్చి ఇప్పటికి రెండు నెలలు కావస్తోంది. కాలువలో పుష్కలంగా నీరు పారుతోంది. నీటిని చెరువుకు మళ్లించడంలో అధికారులు చొరవ చూపలేక పోతున్నారు. ఇప్పటికే ఆపరేటర్‌ను నియమించారు. తెదేపా అధికారంలోకి వచ్చిందని తమ సమస్యలు తీరుతాయని భావించిన రైతులకు అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది.



ఎస్సార్బీసీ కాలువ నుంచి ఎత్తిపోతల పథకానికి పైపుల అనుసంధానం

వేతనాలు అందక నిర్లక్ష్యం

ఐడీసీ అధికారులకు వేతనాలు సుమారు ఎనిమిది నెలలుగారాకపోవడంతో ఎత్తి పోతల పథకాలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు రేగుతున్నాయి. పథకాల నిర్వహణకు సిబ్బంది లేక పోవడం, వేతనాలు రాక పోవడంతో పూర్తిస్థాయిలో దృష్టి సారించని పరిస్థితి నెలకొంది.

పథకం పేరు: జుర్రేరు (దద్దణాల చెరువు) ఎత్తిపోతల పథకం
ఖర్చు పెట్టింది: సుమారు రూ.21 కోట్లు
ఎత్తిపోతల పథకం వినియోగంలోకి: 2018
నిర్మించిన ప్రదేశం: బనగానపల్లి సమీంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాలువ పక్కన
చెరువులో నీరుంటే లబ్ధి పొందే గ్రామాలు: జోలాపురం, సాదు కొట్టం, పాతపాడు, మీరాపురం, మాదాసుపల్లె, యాగంటిపల్లె, బనగానపల్లి
చెరువుతో సాగునీరు: 1550 ఎకరాలకు
లబ్ధి పొందే రైతులు: సుమారు 500 మంది.
తాగునీటితో లబ్ధిపొందే ప్రజలు సుమారు 7000 మంది
వినియోగంలోకి రావాలంటే ఖర్చు పెట్టాల్సింది: రూ.10 లక్షల నుంచి రూ.15లక్షలు
ఒక ఆపరేటర్, వాచ్‌మెన్, ముళ్ల కంపలు తొలగించడం నాలుగు మోటర్లు ఉన్నాయి. వాటికి గ్రీస్ ఇతర మెయింటెనెన్స్ పనులు చేయడం
ఇక్కడ రైతులు వేసే పంటలు: వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి

మంత్రిపై నమ్మకం ఉంది -తిరుమలయ్య, రైతు

ఈ సారి చెరువుకు ఎత్తి పోతల ద్వార సాగునీరు అందుతుందని నమ్మకంగా ఉన్నాం. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై నమ్మకం ఉంది. ఆయన హయాంలోనే నిర్మించారు. ఆయన రైతులతో మాట్లాడి చుట్టు పక్కల రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తారు.

వినియోగంలోకి తెచ్చే పనిలో ఉన్నాం -నారాయణరెడ్డి, ఏఈ

ఎట్టి పరిస్థితుల్లోనూ జుర్రేరు ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకొచ్చే పనిలో ఉన్నాం. ఈ ఏడాది కాలువకు నీరు పుష్కలంగా వస్తుంది. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ఏడాది చెరువులోకి నీరు నింపే కార్యక్రమం చేపడతాం. ఈఈతో మాట్లాడాం. ఆయనతో కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడి వినియోగంలోకి తెస్తాం.

చాగలమర్రి: చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మంజులవాణి ఆధ్వర్యంలో పంచాయతీల పరిధిలో ఆర్థిక వ్యవహారాలు, నియమ నిబంధనలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలను వివరించారు.

ఉయ్యాలవాడ: మండల పరిషత్ కార్యాలయంలో గురు, శుక్ర వారాల్లో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు అందించిన శిక్షణ తరగతులు ముగిసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో శనివారం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండురోజుల శిక్షణ తరగతులు ముగిశాయి. గ్రామాభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యుల పాత్రను శిక్షకుడు సతీష్‌కుమార్ రెడ్డి, బాలాంజనేయులు వివరించారు.

కొలిమిగుండ్ల: స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో 23 మంది ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి చెప్పారు.

కొలిమిగుండ్ల: పెట్నికోటకు చెందిన ఆరుగురు జూదమాడుతుండగా వారిని అరెస్టు చేసి రూ.4,140 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని యూటీఎఫ్ మండల సీనియర్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బొజ్జన్న, నరసింహారెడ్డి, రమేష్‌నాయుడు, సర్వేశ్వరమూర్తి, అంజనప్ప, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఒకే దేశం..ఒకే గుర్తింపు కార్డు(ఏపీఏఏఆర్) విద్యార్థులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో అన్నీ నమోదు చేస్తున్నట్లు ఎంఈవో సోమశేఖర్ తెలిపారు. శనివారం అన్ని పాఠశాలల విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న తీరును ఎంఈవో పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు.

బుగ్గానిపల్లె తండా(బేతంచెర్ల),న్యూస్‌టుడే: బుగ్గానిపల్లె తండా గ్రామ కొండల్లో మూడు సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన దేశావత్ స్వామి నాయక్, దేశావత్ దేవానాయక్, నెనావత్ రమ్లీ బాయిల నుంచి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి డోన్ న్యాయస్థానానికి రిమాండుకు పంపినట్లు సీఐ వెంకటేశ్వరరావు శనివారం రాత్రి తెలిపారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు శనివారం ఎంపీడీవో ఉమామహేశ్వరావు తెలిపారు.

రుద్రవరం: ఆర్.నాగులవరం, నరసాపురం, రుద్రవరం గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకున్న గృహ నిర్మాణాలను ఈఈ శ్రీహరిగోపాల్ పరిశీలించారు. త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. డీఈ విజయ్‌బాబు పాల్గొన్నారు.

◆ రుద్రవరం మండల కేంద్రంలో వెలసిన కాశీవిశ్వేశ్వర ఆంజనేయస్వామి, వేంకటశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి యల్లావత్తులకు చెందిన శేఖర్ రూ.25,116 విరాళం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: అంతా కలసి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచి రేగటి అర్జున్‌రెడ్డి అన్నారు. శనివారం కమలాపురంలోని సచివాలయంలో గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు.

తోడేంళ్లపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: తోడేంళ్లపల్లెకు చెందిన తెదేపా నాయకుడు చల్లా జార్జ(70) చనిపోయారని తెలుసుకున్న తెదేపా మండల కన్వీనరు నరసింహారెడ్డి శనివారం సంతాపం తెలిపారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన గాధంశెట్టి సోహన్ నాలుగో స్థానం సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 17న కర్నూలులో 350 క్రీడాకారులు పాల్గొన్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో రాణించడంతో మెమెంటో, నగదు బహుమతి అందుకున్నారు. సోహన్‌ను ప్రజ్ఞ విద్యాసంస్థల ఛైర్మన్ హేమలతారెడ్డి, గౌరవ సలహాదారులు ప్రజ్ఞ నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు సద్దాం ప్రశంసించారు.



గాధంశెట్టి సోహన్‌ను ప్రశంసిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయికి ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం ఆదర్శ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆర్చరీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. నవంబరు 3, 4, 5 తేదీల్లో పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

22 నుంచి ఆధార్ నమోదు

అవుకు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22 నుంచి 25 వరకు మండలంలోని నాలుగు సచివాలయాల్లో ఉచిత ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగన్న శనివారం తెలిపారు. 22న సంగపట్నం, అన్నవరం, 23న మెట్టుపల్లె, అవుకు-2, 24న కునుకుంట్ల, చెన్నంపల్లె, 25న ఉప్పలపాడు, మంగంపేట గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలంలో ఈనెల 22 నుంచి 25వరకు ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు శనివారం తెలిపారు. 22న రేవనూరు, గుల్లదుర్తి సచివాలయాల్లో, 23న చిన్నకొప్పెర్ల, కోవెలకుంట్ల-2 సచివాలయాల్లో, 24న బిజినవేముల, సౌదరదిన్నె, కోవెలకుంట్ల-3లో, 25న భీమునిపాడు, కోవెలకుంట్ల-4, 5సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వసతి గృహాల తనిఖీ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వసతి గృహాలను శనివారం కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్ తనిఖీ చేశారు. వెలగటూరు రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, సంతపేటలోని బాలిక వసతి గృహాన్ని సందర్శించి అక్కడి వసతులను తెలుసుకున్నారు. న్యాయవాదులు శ్రీనివాసులు, ఖాసీం, తిరుపతయ్య, రాజశేఖర్ ఎస్సై మల్లికార్జునరెడ్డి, వార్డెన్ వనజాక్షి పాల్గొన్నారు.



ఎస్సీ బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న అబ్దుల్ షేక్ రెహమాన్

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

బోయిన్‌చెర్వుపల్లె(ప్యాపిలి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు నేడు వైద్య సేవలు పొందేందుకు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని, అటువంటి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రియా సిమెంట్ కర్మాగారం సీజీఎం చేవూరు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బోయిన్‌చెర్వుపల్లె, శ్రీపురం కాలనీ, ప్రియా సిమెంట్ ఉన్నత పాఠశాలలో ప్రియా సిమెంట్, ప్రజ్ఞ ప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్ల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రాచర్ల, సీతమ్మతాండ, బూరుగల, నేరుడుచెర్ల, కొమ్మెమర్రి, మర్రికుంటతాండ,సీతమ్మతాండ, అలేబాద్, అలేబాద్‌తాండ, గార్లదిన్నె గ్రామాల నుంచి 835 మంది పరీక్షలు చేయించుకున్నారు. డీజీఎం హెచ్‌ఆర్ ఆనంద్ భాస్కర్, పీఆర్వో తమ్మినాన కోటేశ్వరరావు, డాక్టర్ సరోజిని, ప్రిన్సిపల్ శ్రీకుమరన్, లైజన్ అధికారి సాంబశివరావు, వైద్యాధికారులు మానసరెడ్డి, నితీన్ చంద్ర, ధర్మతేజ పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన పొందాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పొందాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డోన్ మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం పద్మావతమ్మ అధ్యక్షతన చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు.



మాట్లాడుతున్న రాహుల్ అంబేడ్కర్

మరమ్మతులు చేపట్టరూ!



రూపనగుడి-ఉయ్యాలవాడ మధ్య ప్రవహిస్తున్న కుందూపై వంతెన శిథిలావస్థకు చేరింది. దీని పొడవునా గుంతలు పడ్డాయి. వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెనపై ఉన్న గుంతలు పూడ్చడానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

గుంత..తీరదా చింత

బనగానపల్లి మండల పరిధిలోని గులాంనబిపేట గ్రామ సమీపంలో బనగానపల్లి-కోవెలకుంట్ల ప్రధాన రహదారిలో గుంత ప్రమాదకరంగా ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ దారిలో రెండుచోట్ల గుంత ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని, సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం



పర్యాటక పురస్కారం స్వీకరణ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డకు చెందిన శిల్పకళాకారిణి దురుగడ్డ భువనేశ్వరి 19వ ప్రపంచ పర్యాటక పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులోని తాజ్ డెక్కన్ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో భువనేశ్వరి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆసియా ప్రైమ్ మీడియా రీసెర్చ్ అండ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 2500 నామపత్రాలు వచ్చాయి. ఇందులో ఉత్తమంగా ఎంపికైన 30 నామపత్రాలకు పురస్కారాలు అందించారు. శిల్పకళ ద్వారా పర్యాటక రంగంలో అందిస్తున్న సేవలకు గాను భువనేశ్వరిని నిర్వాహకులు ఎంపిక చేశారు. తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు నుంచి ఆమె పురస్కారాన్ని స్వీకరించినట్లు తెలిపారు.



పల్లె కబుర్లు

కోవెలకుంట్ల గ్రామీణం: లింగాల: లింగాల నుంచి గుండుపాపల మధ్య పాలేరువాగు సమీపంలో రహదారి పాడవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

బిజనవేముల: బిజనవేముల నుంచి పెద్దకొప్పెర్ల దారిలో ఎస్సార్బీసీ కాలువ సమీపంలో వాగు రోడ్డుపై ప్రవహించడంతో తారు కొట్టుకుని పోయింది. అధికారులు చర్యలు చేపట్టి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెలగటూరు: వెలగటూరులో దస్తగిరి స్వామి దర్గ వద్ద విద్యుత్తు స్తంభం పాడైంది. స్తంభం నుంచి ఇనుప కడ్డీలు బయటకు ప్రమాదకరంగా కన్పిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు.

వల్లంపాడు: చిన్నకొప్పెర్ల, వల్లంపాడు మధ్య ఉన్న నల్లవాగుకు శుక్రవారం వరద తగ్గుముఖం పట్టడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు సాగుతున్నాయి.

సమస్యల్లో మేజర్

◆ చాగలమర్రిలో సదుపాయాలు దూరం

◆ పారిశుద్ధ్య లోపాలతో జనాల బెంబేలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి మేజర్ పంచాయతీ పరిధిలో దాదాపు 24వేలకు పైగా జనాభా ఉన్నా పలు సమస్యలు పరిష్కారం కావడం లేదని నివాసితులు ఆందోళన చెందుతున్నారు.

మేజర్ పంచాయతీలో ప్రధానంగా పారిశుద్ధ్య లోపం ప్రజలను వేధిస్తోంది. కాలనీల్లో సిమెంటు రహదారులు లేక రాకపోకలకు నరకయాతనను అనుభవిస్తున్నామని నివాసితులు వాపోతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, పందుల బెడద మరోవైపు వేదనకు గురి చేస్తోందని నివాసితులు వాపోతున్నారు. మేజర్ పంచాయతీలోని సమస్యల్ని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సంతమార్కెట్ సమీపంలో అపరిశుభ్రత

ప్రధానమైనవి ఇవే!

◆ చాగలమర్రి పట్టణంలోని ముత్యాలపాడు బస్టాండు ఆవరణలో రహదారిపై నిత్యం మురుగు ప్రవహిస్తోంది. ◆ స్థానిక రచ్చబండ, మల్లెవేముల బస్టాండు, రిక్వెస్ట్‌స్టాప్ సమీపంలో గుంపులు గుంపులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో రహదారుల వెంట ప్రజలు ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ◆ సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల, న్యూ ఎస్బీఐ కాలనీ, కోటగడ్డ వీధికి వెళ్లే మలుపు, మల్లెవేముల బస్టాండు సమీపంలో టవర్, భూమానగర్ కాలనీల్లో పందుల బెడద అధికమైంది. గుంపులుగా ఇవి స్వైరవిహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పరిసరాలన్నీ కంపుకొడుతుండటంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ◆ భూమానగర్ కాలనీల్లో సిమెంటు రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ◆ సంతమార్కెట్, రచ్చబండ, పెద్దమకానం తదితర ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ◆ మేజర్ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు లేక పోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని మల్లెవేముల రస్తా, చింతలచెరువు రస్తాలో వేస్తుండడంతో సమీప కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం -తాహిర్‌హుస్సేన్, ఈవోపీఆర్డీ, చాగలమర్రి.

చాగలమర్రి మేజర్ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు ప్రత్యేకంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైతే పనులు వెంటనే చేపడతాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఎన్టీఆర్ ట్రస్ట్‌కు రూ.50 వేల విరాళం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణానికి చెందిన తెదేపా నాయకులు ఏవీ సుబ్బారెడ్డి ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.50 వేల చెక్కును అందజేశారు. శనివారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో టీడీ జనార్దన్‌ను కలిసి రూ.50 వేల చెక్కును అందజేశారు.



టీడీ జనార్దన్‌కు చెక్కును అందజేస్తున్న ఏవీ సుబ్బారెడ్డి

కుష్ఠుపై జాగ్రత్త వహించాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: కుష్ఠుపై జాగ్రత్తలు తీసుకోవాలని నంద్యాల జిల్లా అదనపు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదబాయి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దస్త్రాలను పరిశీలించి పలు సూచనలు అందజేశారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న శారదాబాయి

గ్రామాల్లో పల్లెపండగ వారోత్సవాలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యనకండ్ల, హుసేనాపురం, ఎర్రగుడి, ఇల్లూరుకొత్తపేట తదితర గ్రామాల్లో శనివారం పల్లెపండగ వారోత్సవాలు ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఉపాధిహామీ సిబ్బంది ఆయా గ్రామాలకు చెందిన తెదేపా నాయకులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం: పొట్టిపాడు: కోవెలకుంట్ల మండలం పొట్టిపాడులో శనివారం పల్లె పండగ నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో రూ.20 లక్షల అంచనాతో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

గుల్లదుర్తి: గుల్లదుర్తిలో పల్లెపండగ నిర్వహించారు. నరసింహస్వామి ఆలయం సమీపంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

నేలంపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో మంజులవాణి తెలిపారు. శనివారం మండలంలోని నేలంపాడు, రాంపల్లె గ్రామాల్లో పల్లెపండగ నిర్వహించారు. నేలంపాడులో రూ.20 లక్షలు, రాంపల్లెలో రూ.4 లక్షలతో సిమెంటు రహదారి పనులకు భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏపీవో నిర్మల, తెదేపా నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: పల్లె పండగలో భాగంగా మంగంపేటలో రహదార్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. అంతర్గత రహదార్ల నిర్మాణంతో గ్రామీణులకు మెరుగైన సౌకర్యం కలుగుతుందని ఎంపీడీవో వెంగన్న తెలిపారు. అవుకులో రహదార్ల నిర్మాణానికి రూ.80 వేలు మంజూరయ్యాయన్నారు.

వెంకటాపురం(శిరివెళ్ల), న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల తెదేపా నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. యర్రగుంట్ల, వెంకటాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, జయరామిరెడ్డి, పుల్లారెడ్డి, శీలం ప్రసాద్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న తెదేపా నాయకులు, అధికారులు

సంకలాపురం, సీతారామాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెలకు పూర్వ వైభవం రానుందని తెదేపా నాయకులు శేఖర్, మద్దయ్య, మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని సంకలాపురం, సీతారాంపురం గ్రామాల్లో ఎంపీడీవో ఫజల్ రహిమాన్, ఏఈ మహేష్ ఆధ్వర్యంలో పల్లె పండగ నిర్వహించారు. పలు గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు.

సంజామల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పేరుసోముల తెదేపా నాయకుడు బెలుం సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల అధికారులు పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. రూ.50లక్షలతో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ఆయన ప్రారంభించారు.



పేరుసోములలో పాల్గొన్న తెదేపా నాయకుడు బెలుం సురేష్‌రెడ్డి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉడుములపాడులో శనివారం పల్లెపండగ నిర్వహించారు. రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు సర్పంచి రాధమ్మ, ఎంపీడివో వెంకటేశ్వరరెడ్డి భూమిపూజ చేశారు.

ఉల్లి పంట కోత ప్రయోగంతో లాభాలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పొలాల్లో ఉల్లి పంట కోత ప్రయోగం వల్ల రైతులకు ఎన్నో లాభాలు కలుగుతాయని ఉద్యాన అధికారిణి జి. కళ్యాణి పేర్కొన్నారు. కమలాపురం గ్రామంలో రైతు రామిరెడ్డి పొలంలో సిబ్బంది చేపడుతున్న ఉల్లి పంట కోత ప్రయోగాన్ని ఆమె శనివారం పరిశీలించారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి కళ్యాణి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాల్లో శనివారం 'పొలం బడి' నిర్వహించారు. రాయితీ శనగ విత్తనాలు, భూసార పరీక్షల పత్రాలు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి క్రిష్ణకుమార్, ఉద్యానశాఖ ఏవో ధరణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.